సాక్షి
వికారాబాద్
బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



కంది రైతుకు రంది
తాండూరు కందులకు డిమాండ్ ఉన్నప్పటికీ మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. 8లో▸



అప్పులు తీర్చే మార్గం లేక..
పంట సాగుకు చేసిన అప్పులు రైతు ఉసురు తీశాయి. యాలాల మండలంలో యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 8లో▸



ఫలితాలు ‘పది’లమేనా?
టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి



లిటరసీ ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది

వికారాబాద్ అర్బన్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని ఎల్‌డీఎం రాంబాబు తెలిపారు. జిల్లాలో ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఎన్నెపల్లి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు 2కె రన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం బ్యాంకులు పనిచేస్తున్నాయని, బ్యాంకింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13 నుంచి 17వరకు జిల్లాలో లిటరసీ క్యాంపులు నిర్వహించి ప్రజలకు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవికుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్లకు నివాళులు



నివాళులర్పిస్తున్న విద్యార్థులు, విద్యావంతులు

కొడంగల్ : అమరులైన వీర జవాన్లకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం నివాళులర్పించారు. 2019లో ఉగ్రవాదుల చేతిలో అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని కోరారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమ్మా నాన్న ఆర్గనైజేషన్ సోషల్ సర్వీసెస్, నవీన ఆదర్శ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యావంతులు అమరవీరుల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, అనిల్‌కుమార్, వెంకట్రాములు, ఆనంద్, నరేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

భయాందోళనకు గురైన ప్రయాణికులు



పొగలు రావడంతో బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

తాండూరు రూరల్: ఆర్టీసీ బస్సులో పొగలు వ్యాపించిన ఘటన తాండూరు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తాండూరుకు చెందిన డిపో బస్సు రొంపల్లి, బంట్వారం వెళ్లి తిరిగి తాండూరుకు వస్తుండగా అంతారం శివారులో బస్సుల్లోంచి ఒక్కసారిగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశారు. ప్రయాణికులందరూ బస్సులో నుంచి దిగారు. బస్సులో బ్యాటరీ హీటెక్కడంతో షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వ్యాపించినట్లు డ్రైవర్ తెలిపారు. కొద్దిసేపటికి ప్రయాణికులతో బస్సు తాండూరుకు వెళ్లింది. కాలంచెల్లిన బస్సుల వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

తాండూరు రూరల్: వెనుకబడిన వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గౌతాపూర్ శివారులో వడ్డెరుల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వడ్డెరులు డిమాండ్ల సాధనకు ఐక్యంగా పోరాడాలన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పక్కనే ఉన్న కర్ణాటకలో వడ్డెరులు ఎస్టీ జాబితాలో ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీను, నియోజకవర్గ కన్వీనర్ చెన్నప్ప, అంతారం సర్పంచ్ రాములు, నాయకులు ఉన్నారు.

‘భూకైలాస్’కు రారండీ..

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- 65 అడుగుల శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ
- శివరాత్రి రోజు 9 శక్తిపీఠాల ప్రతిష్ఠాపన



ఆలయంలో శివలింగం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండాలో వెలిసిన ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం భూకైలాస్.. బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు వాసునాయక్ పవార్ తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దేవస్థానం ఆవరణలో 65 అడుగుల శివుడి విగ్రహం ప్రత్యేకత ఆకర్షణ. 40 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు కాల భైరవుడు, వీరభద్రుడు, నందీశ్వరుడు, ఈశ్వరుడు, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు.

నీటిమార్గం గుండా శివుడి దర్శనం

ఎక్కడాలేని విధంగా భూకైలాస్ దేవస్థానంలో నీటి మార్గం గుండా వెళ్లి శివుడి విగ్రహాన్ని దర్శించుకోవడం ప్రత్యేకత. ఈ యేడాది మహా శివరాత్రికి కొత్తగా పలు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. తొమ్మిది శక్తి పీఠాలతో పాటు నవగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. దేవస్థానంలో మహా శివరాత్రి నుంచి నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు తెలిపారు. తాండూరు పట్టణంలోని శివాజీచౌక్ నుంచి మల్‌రెడ్డిపల్లి మీదగా భూకైలాస్‌కు చేరుకోవచ్చు.



అంతారం తండాలో భూకైలాస్ దేవస్థానం

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

భూకైలాస్‌లో బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపకుడు వాసునాయక్ పవార్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈసారి 65 అడుగుల శివుడి విగ్రహంపై శివరాత్రి రోజు డ్రోన్ సహాయంతో పువ్వు లు చల్లుతున్నట్లు వెల్లడించారు.



వాసునాయక్ పవార్

పోడు అర్హులు 426 మందే

వచ్చిన దరఖాస్తులు 9,647
- తేలిన హక్కుదారుల సంఖ్య
- పట్టాలిచ్చేందుకు అధికారుల కసరత్తు
- కోడ్‌తో ఆగిన పంపిణీ ప్రక్రియ



సాగుకు అనువైన పోడు భూమి

వికారాబాద్ : ఎట్టకేలకు పోడు భూముల అర్హుల సంఖ్య తేలింది. ఐదు నెలల పాటు దరఖాస్తులను పరిశీలించిన అధికారులు అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. లబ్ధిదారుల ఎంపిక గత ఏడాది నవంబర్ 15 లోగా పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు ఇంత కాలం కొనసాగించారు. దరఖాస్తుల పరిశీలన విషయంలో నేతల వత్తిళ్లు పెరగడం వల్లే తీవ్ర జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. 15 నెలల క్రితం ప్రభుత్వం పోడు భూములకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించగా ఏడాది పాటు జాప్యం చేస్తూ వచ్చింది. దరఖాస్తులను అటవీ సంరక్షణ కమిటీల ఆధ్వర్యంలో పరిశీలించి పూర్తి చేశారు. రీ వెరిఫికేషన్ చేయలానే డిమాండ్ నేతలు, దరఖాస్తు దారుల నుంచి వ్యక్తమవుతోంది. ఎట్టకేలకు జాబితా సిద్ధమైనా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడినట్టయ్యింది. దీంతో గిరిజనుల్లో ఏడాది క్రితం పొడిచిన పోడు ఆశలు ఇంకా అడియాశలుగానే మిగిలాయి.

తాయిలాల పర్వం..

లబ్ధిదారుల జాబితా తయారైనా మరోవైపు అధికారులపై నేతల వత్తిళ్లు పెరుగుతూనే ఉన్నాయి. కావాల్సిన వారికి పోడు భూములు ఎలాగైనా ఇప్పించాలనే పట్టుదలతో నేతలు, ప్రజా ప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ఇందుకోసం కొన్ని చోట్ల తాయిలాల పర్వానికి కూడా తెరతీసినట్టు తెలుస్తోంది. ఈ కమిటీల్లో జిల్లా మంత్రి, ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండటంతో ఎంపిక విధానం నిజమైన పోడు రైతులకు కాకుండా అధికార పార్టీ అనుకూల వ్యక్తులకు లబ్ధిచేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు అడవి ప్రాంతాన్ని కుచించుకుపోకుండా ఉండేందుకు అటవీ శాఖ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ గట్టిగా పోరాటం చేసిన అటవీ శాఖ అధికారి తాజాగా బదిలీ కావడంతో పైరవీకారులు మళ్లీ పావులు కదుపుతున్నారు. అయితే అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో అర్హుల జాబితాను ఆన్‌లైన్ చేయటం, వారికి పాసు పుస్తకాలు తయారు చేయటం వంటి పనులు చేపడుతున్నారు.

శాశ్వత పరిష్కారం..

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఆ దిశగా కసరత్తు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అధికారులు అటవీ ప్రాంతాలతో సంబంధం ఉన్న 126 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 133 గ్రామాల్లో అటవీ సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. అధికారులు ఊహించని విధంగా 21,761 ఎకరాల్లో కబ్జాలో ఉన్నట్టు 9,647 మంది పోడు రైతులు పోడు హక్కుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అటవీ సంరక్షణ నిబంధనల ప్రకారం 2005 ఏడాది కంటే ముందు నుంచే అటవీ భూముల్లో కబ్జాలో ఉన్న గిరిజన రైతులను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో 70 ఏళ్ల ముందు నుంచే ఎవరైనా గిరిజనేతరులు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తూ ఉంటే వారిని కూడా పరిగణలోకి తీసుకుంటారు. అయితే 2006-08 మధ్య కాలంలో జిల్లాలో అప్పటి వరకు కబ్జాలో ఉన్న 672 మంది గిరిజనేతరులకు అప్పటి ప్రభుత్వం పోడు హక్కులు కల్పించినట్టు రికార్డులు చెబుతున్నాయి. అంటే ప్రస్తుత పోడు హక్కు దారుల జాబితాలో గిరిజనేతరుల దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోవడంలేదు. జిల్లాలో మొత్తం 9,647 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 4,804 మంది గిరిజనేతరులు దరఖాస్తులు చేసుకోగా 4,843 మంది గిరిజనులు పోడు హక్కుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది గిరిజనులు మైనర్లుగా ఉండటం తదితర కారణాలతో జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో 426 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు.

ఉపాధి పనులు వేగిరం చేయండి



ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

- వచ్చే నెలలోగా రూ.60 కోట్ల పనులు పూర్తి చేయాలి
- సకాలంలో చేయకపోతే నిధులు రద్దవుతాయి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు దిశానిర్దేశం

వికారాబాద్ అర్బన్: జాతీయ ఉపాధి హామీ కింద చేపడుతున్న రూ.60 కోట్ల పనులను వచ్చే నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ పనులు, మన ఊరు- మనబడి, అటెండెన్స్ యాప్ పని తీరుపై అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం 40 రోజులు ఉన్నందున ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలన్నారు. వచ్చే నెల 15లోపు ఎఫ్‌టీఓ జనరేట్ చేసి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో పూర్తి చేయనట్లయితే నిధులు రద్దు అవుతాయన్నారు. సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలను సాంకేతిక పరంగా ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు చేపట్టిన పనులకు కచ్చితంగా నిధులు మంజూరు అవుతాయనే భరోసా ఇవ్వాలని అధికారులకు సూచించారు. వచ్చే సోమవారం నాటికి పురోగతి లేకుంటే ఆ నిధులను ఇతర పనులకు కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపీడీఓలు పురోగతిలో ఉన్న పనులను ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి పంపాలని ఆదేశించారు.

‘మన బడి’ పనులూ..

మన ఊరు- మనబడి కింద చేపట్టిన పనులను కూడా వేగవంతం చేయాలని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలన్నీ వచ్చే నెల 16 వరకు పూర్తి చేసి 31 వరకు ప్రారంభించాలని తెలిపారు. అటెండెన్స్ యాప్‌లో హాజరు లేకుంటే వేతనాలు నిలిపివేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఉద్యోగి అటెండెన్స్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, డీఈఓ రేణుకాదేవి, పంచాయతీరాజ్ ఈఈ రేణుక తదితరులు పాల్గొన్నారు.

శనగల కొనుగోల్‌మాల్!



సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

- రైతుల నిలువుదోపిడీ
- బస్తాకు 10 కిలోలు అదనంగా తూకం
- సొసైటీ అధికారుల చేతివాటం

బషీరాబాద్: రైతులు మరోసారి నిలువుదోపిడీకి గురయ్యారు. నావంద్గీ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన శనగల కొనుగోళ్లల్లో బస్తాకు అదనంగా 10 కిలోలు తూకం వేస్తూ అక్రమాలకు తెరలేపింది. సొసైటీ అధికారులే తెరవెనుక ఉండి నడిపించడంతో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు. తూకాలు వేసిన బస్తాల్లో నుంచి అదనంగా దోపిడీ చేసిన శనగలను అక్రమంగా అర్ధరాత్రి తరలిస్తూ రైతులకు చిక్కారు. ఈ ఘటన బషీరాబాద్ మండల కేంద్రంలో మంగళవారం వెలుగు చూసింది. కొనుగోలు కేంద్రంలో శనగలను అదనంగా తూకం వేస్తూ కూలీలు మోసం చేయడాన్ని మంగళవారం ఓ రైతు పట్టుకున్నాడు. ఇతర రైతులతో కలిసి సొసైటీ ఎదుట ఆందోళనకు దిగారు. సోమవారం రాత్రి కూడా సొసైటీ అధికారులెవరూ లేకుండానే పర్వతపల్లికి చెందిన కుర్వ నర్సింహులు శనగల బస్తాలను కూలీలు తూకం వేశారు. అయితే బస్తాకు అదనంగా 10 కిలోలు తూకం వేసి బస్తాలను పక్కకు పెట్టారు. అందులోంచి శనగలను వేరో బస్తాలో వేసి మూటకట్టిపెట్టడం రైతులు గమనించారు. ఉదయం కేంద్రం వద్దకు వచ్చిన రైతులకు రాత్రి జరిగిన దొంగతనం గురించి చెప్పాడు. అలాగే ఫోన్‌లో సొసైటీ చైర్మన్ వెంకట్రామ్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. చైర్మన్ వెంటనే సొసైటీకి చేరుకుని రాత్రి జరిగిన ఘటనపై ఆరాతీశాడు. తూకాలువేసిన ముగ్గురు కూలీలు రాత్రికి రాత్రి పారిపోగా, అక్కడున్న మరో ఇద్దరు కూలీలను పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి సొసైటీ కేంద్రానికి చేరుకుని అక్కడున్న రైతుల సమక్షంలో విచారించారు. సొసైటీ సీఈవో వెంకటయ్య సూచన మేరకు అదనంగా తూకాలు వేసినట్లు ఇద్దరు కూలీలు చెప్పారు. దీంతో సొసైటీ సీసీ కెమరాల్లో రాత్రి జరిగిన ఘటన ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. మరో వైపు రైతుల నుంచి అదనంగా శగనలు దోపిడీ చేసిన ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు చైర్మన్ ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారం వెనక సొసైటీ సీఈఓ ఉన్నారని, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రాక్టికల్స్ చేసేదెలా?

- కళాశాలల్లో నేటి నుంచే పరీక్షలు
- ల్యాబ్‌లు లేక నామమాత్రపు శిక్షణ
- విద్యార్థుల్లో అయోమయం

వికారాబాద్ అర్బన్: ఇంటర్ విద్య ఉన్నత చదువులకు బాటలు వేస్తుంది. ఆ తరువాత ఎంసెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలు రాసి ఉన్నత విద్యకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యను అభ్యసించవచ్చు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఇంటర్ విద్యపై, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులతో వారి వారి కళాశాలల్లో ప్రాక్టికల్స్ చేయించడం లేదు. దీంతో వారు చదువుపై పెద్దగా పట్టు సాధించలేక పోతున్నారు. పలు కళాశాలల్లో తరగతి గదుల్లో తాత్కాలికంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి రెండు మూడు రోజులు ప్రాక్టికల్స్ చేయించి మమా అనిపిస్తున్నారు. ఈ నెల 15 నుంచి సెకండియర్ విద్యార్థులకు వార్షిక ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు సిద్ధమైంది. వార్షిక పరీక్షలకు ముందు అధ్యాపకులు విద్యార్థులకు ప్రయోగాలు చేయించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు చాలా కళాశాలల్లో ప్రాక్టికల్స్ అంటే ఏమిటో తెలియని విద్యార్థులు ఉన్నారు.

వీరికి తప్పనిసరి..

ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు తప్పనిసరి . వీరితో పాటు ప్రాక్టికల్స్‌లో వచ్చే మార్కుల ఆధారంగా ఫలితాలు వెలువడుతాయి. సైన్స్ విద్యార్థులకు మొదటి ఏడాది నుంచే ప్రాక్టికల్స్ చేయించడం ప్రారంభిస్తారు. బైపీసీ విద్యార్థులకు బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, బొమ్మలు గీయడంతో పాటు రికార్డులు రాయిస్తారు. ఇందుకోసం క్షేత్ర పర్యటన, బొటానికల్ టూర్స్ వంటివి నిర్వహిస్తారు. మ్యాథ్స్ విద్యార్థులకు కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. చాలా కళాశాల్లో ప్రాక్టికల్స్ నిర్వహించక పోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

రెండు కళాశాలల్లోనే ల్యాబ్స్..

జిల్లాలో తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. సుమారు 900 మంది సెకండియర్ సైన్స్, మ్యాథ్స్ విద్యార్థులు ఉన్నారు. వీరంతా ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లాలో కేవలం రెండు ప్రభుత్వ కళాశాలల్లోనే ల్యాబ్స్ ఉన్నాయి. మిగతా ఏడు కళాశాలల్లో కనీస తరగతి గదులు లేవు. ప్రభుత్వ కళాశాలల్లో ల్యాబ్స్ లేకపోవడంతో రసాయనాలను తరగతి గదుల్లో ఉంచి రెండు మూడు రోజుల మాత్రమే ప్రాక్టికల్స్ చేయించారు. బైపీసీకి సంబంధించిన బాటనీ, జ్వాలజీ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ చేపించేందుకు అవసరమైన పరికరాలు, రసాయనాలు లేక పోవడంతో కొన్ని కళాశాలల్లో ప్రైవేటు కళాశాలల నుండి తెప్పించుకొని విద్యార్థులకు చూపించారు. మారు మూల మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అలాంటి అవకాశం లేక పోవడంతో నామమాత్రంగా నిర్వహించారు.


ప్రైవేటులోనూ అంతే..

జిల్లాలో 27 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో కూడా విద్యార్థులకు అవసరమైన మేర ప్రాక్టికల్స్ నేర్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పరీక్షల సమయాల్లో ఇతర కళాశాలల నుంచి వచ్చే ఎక్స్‌ట్రనల్‌కు యాజమాన్యాలు డబ్బులు ఇస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో నైపుణ్యం లేకపోయినా పాస్ మార్కులు వేసి వెళ్తున్నారు. రసాయనాలు, పరికరాలు కొంటే లక్షల్లో ఖర్చు అవుతుండటంతో ఇలా వేల రూపాయలతో చేతులు తడుపుతూ ప్రాక్టికల్స్ పరీక్షలు ముగిస్తున్నారు.



వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదిలోనే ప్రాక్టికల్స్ నిర్వహణ

“ ప్రాక్టికల్స్‌కు అంతా సిద్ధం



కళాశాలల్లో ఈ నెల 15 నుంచి నిర్వహించే ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్నీ సిద్ధం చేశాం. అవకాశం ఉన్నంత మేర విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించాం. ప్రభుత్వ కళాశాలల్లో ఏదైనా లేకుంటే ప్రైవేటు నుంచి తెప్పించుకొని చూపించడం జరిగింది. ప్రైవేటు కళాశాలల తీరుపై ఈ సారి గట్టి నిఘా పెడుతాం. పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శంకర్ నాయక్, డీఐఈవో

క్లుప్తంగా

20న సేవాలాల్ అవతార మహోత్సవం



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు

పెద్దేముల్: బంజారా ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అవతార మహోత్సవం మండల పరిధిలోని కందనెల్లి తండాలో ఈ నెల 20న నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు పెద్ద ఎత్తున బంజారాలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాగో బంజారా సమాజ్, యాడీ బాపుఘాట్ దేవస్థాన ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు రాథోడ్ రమావత్ సురేందర్ మహారాజ్, ధర్మకర్త రమావత్ శాంతిబాయ్ పాల్గొన్నారు.

వడ్డీలు చెల్లించాల్సిందే

సీఈఓ శేఖర్



రైతులతో మాట్లాడుతున్న సీఈఓ శేఖర్

మోమిన్‌పేట: పంట రుణాలు తీసుకున్న ప్రతీ రైతు వడ్డీ చెల్లించాల్సిందేనని మోమిన్‌పేట పీఏసీఎస్ సీఈఓ శేఖర్ అన్నారు. మంగళవారం ఆయన ఎన్కేపల్లిలో రైతులతో మాట్లాడారు. రైతులు నాలుగేళ్లుగా పంట రుణాలపై వడ్డీలు చెల్లించడం లేదన్నారు. రూ.లక్షలోపు రుణాలు మాఫీ అవుతాయని.. వాటి వడ్డీలు మాత్రం రైతులే చెల్లించాలని చెప్పారు. 2018వరకు ఉన్న రుణంలో రూ.లక్షలోపు పంటరుణాలను మాఫీ చేస్తా మని ప్రభుత్వం పేర్కొందన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం వడ్డీలు చెల్లించనందున రైతులే చెల్లించాలన్నారు. ఒక వేళ ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తే రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ప్రభుత్వం మాఫీ చేసిన రుణాలు వడ్డీలకే సరిపోతుందన్నారు. వాయిదాల ప్రకారం దీర్ఘకాలిక రుణాలను చెల్లించాలని ఆయన సూచించారు. లేదంటే రుణ బకాయిలు పెరిగిపోతుంటాయన్నారు. ఆయన వెంట సిబ్బంది బాలయ్య తదితరులు ఉన్నారు.

లారీ, బైక్ ఢీ..

కర్ణాటకవాసి మృతి

తాండూరు రూరల్: లారీ బైక్ ఢీకొన్న ప్రమాదంలో కర్ణాటకవాసి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గౌతపూర్ వద్ద చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకా పోల్కంపల్లి గ్రామానికి చెందిన దేవేంద్రప్ప(25) సోమవారం రాత్రి బైక్‌పై తాండూరు వెళ్లి రాత్రి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దేవేంద్రప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

కంది రైతుకు రంది

తాండూరు కందులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ ఆశించిన ధరలు లేక రైతులు సతమతమవుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి అన్నదాతలను మోసం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

- డిమాండ్ ఉన్నా ధర అంతంతే!
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



తాండూరు వ్యవసాయ మార్కెట్

తాండూరు: తాండూరు కంది పప్పు అంటే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇటీవల దీనికి భౌగోళిక గుర్తింపు వచ్చింది. అయినప్పటికీ కంది పండించే రైతులకు మాత్రం లాభం చేకూరడం లేదు. మార్కెట్‌లోని వ్యాపారులు సిండికేట్‌గా మారి కంది ఉత్పత్తులకు ధర పెరగకుండా రైతులకు ఆర్థిక ఇబ్బందులు తెచ్చి పెడుతున్నారు. కందుల కొనుగోళ్లలో కనిష్ట ధర పేరిట పూర్తిగా తక్కువ చేసి రైతులను మోసం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన కొనుగోళ్లు సగం వరకు కనిష్ట ధరకే కొనుగోలు చేయడం గమనర్హం.

కందులతోనే మార్కెట్ గుర్తింపు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొట్టమొదటి వ్యవసాయ మార్కెట్ కమిటీగా తాండూరు మార్కెట్ యార్డు ఖ్యాతిగాంచింది. ప్రధానంగా కందుల వ్యాపారంతోనే తాండూరు మార్కెట్ గుర్తింపు వచ్చింది. వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా ప్రతి ఏటా 1.30 లక్షల క్వింటాళ్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. తాండూరు మార్కెట్ కమిటీ ఆధీనంలో 75 కమీషన్ ఏజెంట్‌లు, 80 వరకు ట్రేడర్‌లు వ్యాపారం కోసం లైసెన్స్‌లున్నాయి. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పంట ఉత్పత్తులను మార్కెట్ ధరకు అనుగుణంగా బిడ్డింగ్ చేయాలి. కానీ కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఒకే ధర వెలకట్టి పంట ఉత్పత్తులను బిడ్డింగ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే మార్కెట్‌లో జరిగే బిడ్డింగ్‌లను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

కనిష్ట ధరలకే కొనుగోళ్లు..

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కనిష్ట, గరిష్ట, సగటు ధరల చొప్పున బిడ్డింగ్‌లు వేస్తున్నారు. స్థానిక వ్యాపారులు కంది ఉత్పత్తులు సరిగా లేవంటూ తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ధర లభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. మరోవైపు తక్ పట్టీల పేరిట అదనంగా రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. సాంకేతికత ముసుగులో సాగుతున్న దోపిడిని అడ్డుకట్ట వేసే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

కంది పప్పు ధర ఎక్కువ..

వ్యాపారులు కందులకు ధర పెంచకుండా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో కందుల ధర క్వింటాలుకు కనిష్ట ధర రూ. 4,761, గరిష్ట ధర రూ.7,901, సగటు ధర రూ.7,659 చొప్పున పలికాయి. అయితే తాండూరు పట్టణంలో ఉన్న దాల్‌మిల్లుల్లో కందిపప్పును కొనుగోలు చేసేందుకు వెళితే క్వింటాలు కందిపప్పుకు రూ.11,500 ధరతో దాల్ మిల్లుల్లోనే విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో కందులకు పలకని ధర కందిపప్పునకు మాత్రం భారీగా పెంచి వ్యాపారం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కందుల వ్యాపారం కొనసాగుతోంది. కొనుగోళ్ల లక్ష్యం చేరలేదు. ప్రస్తుతం తాండూరు కందులకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. స్థానిక మార్కెటింగ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అయితే మార్కెట్‌లో అవకతవకలు జరుగుతున్నాయనేది తన దృష్టికి రాలేదు. మార్కెట్‌ను సందర్శించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.
-సారంగపాణి,డీఎం, మార్కెటింగ్ శాఖ, వికారాబాద్

అప్పులు తీర్చే మార్గం లేక..

యువరైతు బలవన్మరణం



అంజిలయ్య(ఫైల్)

యాలాల: పంట సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువరైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దుర్ఘటన మండల పరిధిలోని బండమీదిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లె అంజిలయ్య(35)కు మూడెకరాల పొలం ఉంది. ఈ ఏడాది మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశాడు. ఈ ఎనిమిదెకరాల్లో పంట సాగుకు రూ.7లక్షల అప్పు చేశాడు. దీనికి తోడు పంట దిగుబడి సైతం అంతంతమాత్రంగానే ఉండడంతో తరుచూ భార్య పార్వతమ్మతో ఇదే విషయమై చెబుతూ ఆవేదన చెందుతుండే వాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కల్లానికి భార్యతో కలిసి వెళ్లాడు. రాత్రి సమయంలో కళ్లం వద్ద నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రివేళ పార్వతమ్మ నిద్రలేచి చూడగా అంజిలయ్య కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన పార్వతమ్మ సెల్ ఫోన్ టార్చి సాయంతో చుట్టుపక్కల వెతకగా పొలం గట్టునున్న వేపచెట్టుకు వేలాడుతూ అంజిలయ్య మృతదేహం కనిపించింది. ఆమె వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహానికి తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్యతో పాటు కుమారులు అక్షిత్‌కుమార్, రిషి ఉన్నారు. పార్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కుమారులను పట్టుకుని రోదిస్తున్న పార్వతమ్మ

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బండమీదిపల్లిలో రైతు అంజిలయ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్ అడిగి తెలుసుకున్నారు. శుభప్రద్ యువసేన సభ్యుల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. భానుప్రసాద్, కుర్వ బాలు, హరీష్, ప్రశాంత్, విజయ్, నరేష్‌గౌడ్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

జీపీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్



వినతిపత్రం అందజేస్తున్న జీపీ వర్కర్లు

బంట్వారం: గ్రామ పంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని జీపీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల జీపీ వర్కర్లతో కలిసి ఆయన మండల పరిషత్ కార్యాలయాల ఎదుట వేర్వేరుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఐదు నెలలుగా జీపీ వర్కర్లకు జీతాలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జీపీ వర్కర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని ఆయన హెచ్చరించారు. అనంతరం బంట్వారం, కోట్‌పల్లి ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల జీపీ వర్కర్లు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: యువత సన్మార్గంలో నడవాలని.. తొందరపాటు నిర్ణయాలు తీసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. చౌడాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ ప్రేమ విఫలమైందని ఆదివారం ఆత్మహత్య చేసుకోగా మంగళవారం బాధిత కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. క్షణికావేశాలతో తీసుకునే నిర్ణయాలతో తీవ్ర నష్టాలు ఏర్పడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కులకచర్ల మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింలు, సర్పంచ్ కొత్త రంగారెడ్డి, నాయకులు బన్సీలాల్, యాదయ్య, రాజయ్య, నర్సింలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- రూ.500కే గ్యాస్ సిలిండర్
- హాథ్ సే హాథ్ జోడో యాత్రలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



బంట్వారం: మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్



పెద్దేముల్: మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్

బంట్వారం: అవినీతి పాలనకు చరమ గీతం పాడాలంటే కేసీఆర్‌ను గద్దె దించాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రంలో భాగంగా మంగళవారం ఆయన బంట్వారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మేనికాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. తాము అధికారంలోకి రాగానే రూ.500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని మహిళలకు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను మళ్లీ తీసుకువస్తామన్నారు. అర్హులైన దంపతులిద్దరికీ పింఛన్ మంజూరు చేస్తామన్నారు. తెలంగాణ సంపదను కేసీఆర్ కుటుంబం దోచుకుంటుంద ని ఆరోపించారు. ధనిక రాష్ట్రానికి ఐదు లక్షల కో ట్లు అప్పుల పాపం కట్టబెట్టారని దుయ్యబట్టా రు. బంగారు తెలంగాణ పేరిట రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టారని విమర్శించారు. మరోసారి మోసగించేందుకు సిద్ధమవుతున్న కేసీఆర్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే పేదల బతుకులు మారుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ అన్సారీ, జెడ్పీటీసీ సంతోష, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, మర్పల్లి మండల అధ్యక్షుడు రవీందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు నర్సింలు, పురుషోత్తంరెడ్డి, వీరేశం, శంకర్‌యాదవ్, వెంకటేశం, శ్రీకాంత్, తౌఫిక్, అజీం, సంజీవ్, ఆనంద్, సలీం, మున్నాబాయ్, ఇసాక్, ముజీబ్, దేవరాజ్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

'ఒకరు సాండ్ మాఫియా.. మరొకరు ల్యాండ్ మాఫియా'

పెద్దేముల్: ప్రజలు అవకాశమిచ్చిన ఇద్దరు నేతలు పార్టీలు మారి ఒకరు సాండ్ మాఫియా.. మరొకరు ల్యాండ్ మాఫియాగా మారారని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ ఆరోపించారు. మంగళవారం తాండూరు పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా పెద్దేముల్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మహరాజ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇందిరమ్మ హయాంలోనే న్యాయం జరిగిందన్నారు. ఎనిమిదేళ్ల కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ నేతలు తప్పా ఎవరూ బాగు పడలేదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తే గెలిచిన రోహిత్‌రెడ్డి సొంత వ్యాపారాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌లో చేరి తాండూరు అభివృద్ధిని విస్మరించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ ఒక్కరు సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి తనయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్ మహరాజ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు రాకేశ్ మహరాజ్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, వైస్ ఎంపీపీ మధులత, పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ.రియాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, నాయకులు జనార్దన్ రెడ్డి, శంకర్, మల్లప్ప, బిచ్చప్ప, వెంకటయ్య, బండెప్ప, జగన్, రామునాయక్‌తో తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



బాల్‌రాజ్(ఫైల్)

యాలాల: రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని జుంటుపల్లి గ్రామానికి చెందిన బాల్‌రాజ్(28) ఈనెల 5న అగ్గనూరు సమీపంలో బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బాల్‌రాజ్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్ డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కేసులు

తూనీకలు, కొలతల జిల్లా అధికారి అశోక్‌రావు

మర్పల్లి: వ్యాపారస్తులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని తూనీకలు–కొలతల జిల్లా అధికారి అశోక్‌రావు హెచ్చరించారు. మంగళవారం ఆయన మర్పల్లి మార్కెట్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన చిల్లర వ్యాపారుల కాంటాలను పరిశీలించి ఐదుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసి రూ.50వేలు జరిమానా విధించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్ నిబంధనలకు అనుగునంగా 50కిలోల బస్తాకు ఒక కిలో తరుగు తీయాల్సి ఉండగా.. కొందరు వ్యాపారులు 3 నుంచి 5కేజీల వరకు తరుగు తీస్తున్నట్లు తనిఖీల్లో బయటపడిందన్నారు. మరికొంత మంది వ్యాపారులు సేకరించిన ధాన్యానికి తూకాల చిట్టీలు తమ దగ్గర పెట్టుకోవడం లేదన్నారు. కాంటాల దగ్గర గుమికూడి కాంటా వేసే సమయంలో బటన్‌లను నొక్కి మోసాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల తనిఖీల విషయం తెలుసుకున్న కొంత మంది వ్యాపారులు దుకాణాలు బంద్ చేసి వెళ్లి పోవడం గమనర్హం.



మోసాలకు పాల్పడుతున్న వ్యాపారస్తుల వివరాలు వెల్లడిస్తున్న అశోక్‌రావు

కేంద్రం నిధులతోనే సంక్షేమ పథకాలు

'ప్రజా గోస–బీజేపీ భరోసా'లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

ధారూరు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ అన్నారు. ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అంతారం, రాజాపూర్, మోమిన్‌ఖుర్దు గ్రామాల్లో శక్తి కేంద్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పనులు 2017 నుంచి కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు మారిన పనులు పూర్తి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతోనే పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని ఆరోపించారు. జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేసినా ధారూరు మండలానికి ఇంతవరకు రాలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధికి పనులకు నిధులు కేటాయించకుండా ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పనులతో అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. కాగా మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు స్వచ్ఛందంగా సమావేశానికి హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రవీందర్‌గౌడ్, నరోత్తమ్‌రెడ్డి, ఎం.రమేశ్, అనిల్‌గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్న మహిళలు

బడి మానేసిన పిల్లలు పాఠశాలకు



బడి మానేసిన పిల్లలతో మాట్లాడుతున్న సీఆర్‌పీ, ఎంవీఎఫ్ బృందం

సాక్షి ఎఫెక్ట్..

వికారాబాద్ అర్బన్: 'బాల్యం అడవి పాలు' అనే 'సాక్షి' కథనానికి కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. చెంచుపల్లి గ్రామానికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని డీఈఓ రేణుకాదేవిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశంతో మంగళవారం ఆమె వికారాబాద్ మండల సీఆర్‌పీ, ఎంవీఎఫ్, చైల్డ్‌లైన్ బృందం చెంచుపల్లి గ్రామానికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చదువుపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కోవిడ్ తర్వాత డ్రాపౌట్ అయిన నలుగురు విద్యార్థులను గుర్తించినట్లు బృందం సభ్యులు తెలిపారు. ఇద్దరిని పక్కనే ఉన్న మదన్‌పల్లి పాఠశాలలో 7వ తరగతిలో, మరో ఇద్దరిని పరిగిలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వసతిగృహాల్లో చేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ నర్సింలు, శ్రీనివాస్, ఎంవీఎఫ్ వెంకటయ్య, సీఆర్‌పీ అనిత పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బొంరాస్‌పేట: ఇల్లరికం వచ్చి కుటుంబానికి వారసత్వం వహిస్తాడనుకున్న వ్యక్తి తాగుడుకు బానిసై భార్యను హతమార్చాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఏర్పుమళ్లలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బర్ల బుగ్గమ్మ, నర్సప్పల చిన్న కూతురు బర్ల పెంటమ్మ(25)కు దోమ మండలం మల్లెపల్లి నుంచి నర్సింలును పదేళ్ల క్రితం ఇల్లరికం తెచ్చుకున్నారు. ప్రస్తుతం పెంటమ్మ, నర్సింలుకు మూడేళ్ల కుమారుడున్నాడు. తాగుడుకు బానిసైన నర్సింలు భార్యను తరుచూ కొడుతూ హింసించేవాడు. ఈ క్రమంలో సోమవారం భార్య, అత్తపై దాడి చేస్తుండగా చుట్టుపక్కలవారు నచ్చజెప్పారు. తిరిగి అర్ధరాత్రి సమయంలో నిందుతుడు భార్యతో గొడవపడి రోకలితో దాడి చేసి హత్యచేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి నర్సింలును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నయీముద్దీన్ తెలిపారు. మూడునెలల గర్భవతియైన మృతురాలిని అత్యంత దారుణంగా హింసించి హతమార్చినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్పీ కార్యాలయానికి మురళీకృష్ణ

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు విచారణ



డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన మురళీకృష్ణగౌడ్

తాండూరు: కులమతాల మధ్య జరిగిన ఘర్షణకు ప్రేరేపించిన కేసులో పరిగి జైలులో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌ను తాండూరు సబ్ డివిజన్ అధికారి కస్టడీకి తీసుకొన్నారు. మంగళవారం తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మురళీకృష్ణగౌడ్‌ను విచారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మురళీకృష్ణ పోలీసు అధికారుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. గడువు దగ్గర పడడడంతో తిరిగి ఆయన్ను పరిగి జైలుకు తరలించారు. మరో రెండు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొనేందుకు పోలీసు అధికారులు కోర్టుకు వెళ్లనున్నారు. మురళీకృష్ణను తాండూరుకు తీసుకొస్తున్నారని తెలుసుకున్న బీజేపీ నాయకులు, అభిమానులు డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేశ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు శ్రీలత, పట్టణ అధ్యక్షుడు గోరేపల్లి సుందర్శన్‌గౌడ్, నాయకులు మురళీకృష్ణకు భరోసా కల్పించారు.